సాక్షి కర్నూలు

శుక్రవారం । 12 । సెప్టెంబర్ । 2025



కనకదాసు విగ్రహం ధ్వంసం

ఆలూరు మండలం మనేకుర్తి గ్రామంలో హైవే-167 పక్కన ఏర్పాటు చేసిన భక్త కనకదాసు విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి ధ్వంసం చేశారు. 8లో▸



కేంద్రియ విద్యాలయంలో సీట్ల భర్తీ

డోన్‌లో కొత్తగా ఏర్పాటైన కేంద్రియ విద్యాలయంలో విద్యార్థులకు సీట్లు కేటాయించారు. ప్రతి తరగతికి 40 మంది విద్యార్థుల చొప్పున 200 మందికి ప్రవేశం కల్పించారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,626.06
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:19,565
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:19,104

న్యూస్‌రీల్

కేఎంసీలో పెరిగిన మెడిసిన్ పీజీ సీట్లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలోని జనరల్ మెడిసిన్ విభాగానికి అదనంగా తొమ్మిది పీజీ సీట్లు పెరిగాయి. ప్రస్తుతం 20 పీజీ సీట్లు ఉండగా, అదనంగా 9 సీట్లకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ అనుమతిచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ తెలిపారు. పెరిగిన సీట్లు ఈ విద్యా సంవత్సరం నుంచే అందుబాటులోకి వస్తాయని, ఈ సీట్ల కోసం ప్రత్యేకంగా జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ శ్రీరాములును ఢిల్లీకి పంపి ప్రక్రియ పూర్తి చేయించామన్నారు. ప్లాస్టిక్ సర్జరీ, క్యాన్సర్ మొదలైన విభాగాల్లో అదనపు పీజీ సీట్ల కోసం ప్రతిపాదనలు పంపించామని, వచ్చే విద్యాసంవత్సరం అవి కూడా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు.

శని, ఆదివారాల్లో మార్కెట్‌కు సెలవు

కర్నూలు(సెంట్రల్): శని, ఆదివారాల్లో కర్నూలు మార్కెట్ యార్డుకు సెలవు ఉండడంతో ఉల్లిని తాడేపల్లిగూడెంకు తరలించి అమ్ముకోవాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య గురువారం ఓ ప్రకటనలో సూచించారు. అక్కడ అమ్ముకున్నా క్వింటా ఉల్లికి రూ.1200 మద్దతు ధర ఉంటుందన్నారు. అయితే కర్నూలు జిల్లా నుంచి తాడేపల్లిగూడెంకు ఉల్లిని తీసుకెళ్తే ఇచ్చే మద్దతు ధర రవాణా ఖర్చులకే సరిపోతుందని రైతులు పేర్కొంటుండటం గమనార్హం. కాగా, తాడేపల్లెగూడెంకు వెళ్లే రైతులు ఆధార్, బ్యాంకు పాసు బుక్, ఈక్రాప్ నమోదు ఒరిజినల్ సర్టిఫికెట్, పొలం పాసు బుక్కు తీసుకెళ్లాలని ఆమె సూచించారు. కాగా, మే నుంచి జూన్ 15వ తేదీ వరకు ఉండి పక్వానికి వచ్చిన ఉల్లిని మాత్రమే కోయాలని సూచించారు. జూలైలో వేసిన పంటను అక్టోబర్ వరకు వేచి ఉండి కోయాలని పొలంలో కనీసం వందరోజులు ఉండాలని, కోసిన తరువాత బాగా అరబెట్టుకొని గ్రేడింగ్ చేసి మార్కెట్‌కు తీసుకొస్తే మద్దతు ధర లభిస్తుందని పేర్కొన్నారు.


పెద్దాసుపత్రిలో డయాలసిస్ మిషన్లు ప్రారంభం



డయాలసిస్ యంత్రాలను ప్రారంభిస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ జిక్కి, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని నెఫ్రాలజీ విభాగంలో రెండు అత్యాధునిక డయాలసిస్ మిషన్లను గురువారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయాలసిస్ రోగుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో కొత్తగా వచ్చిన ఈ రెండు యంత్రాల ద్వారా రోగులకు మరింత సమర్థవంతమైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది సమన్వయంతో రోగులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సేవలు అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సౌకర్యాలు సమకూరుస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, నెఫ్రాలజీ విభాగ వైద్యులు పీఎస్ జిక్కి, అనంత్, వెంకటపక్కిరెడ్డి, శ్రీధర్ శర్మ పాల్గొన్నారు.

జీడీపీకి భారీగా వరద నీరు



గాజులదిన్నె ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీరు

కర్నూలు సిటీ: భారీ వర్షాలతో గాజులదిన్నె ప్రాజెక్టు (జీడీపీ)కు వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఇంజినీర్లు ప్రాజెక్టు గేట్లు ఎత్తేందుకు సిద్ధం అవుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 3.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గేట్లు ఎత్తితే హంద్రీ నదీతీర ప్రాంత ప్రజలను అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచనలు చేశారు.

సుంకేసులలో..

ప్రస్తుతం సుంకేసుల జలాశయంలో 78 టీఎంసీల నీరు నిల్వ ఉండగా 6 క్రస్టు గేట్లను ఎత్తి 26,676 క్యూసెక్కులు దిగువకు, కేసీ కెనాల్‌కు 2012 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

రేపు జాతీయ లోక్ అదాలత్

కర్నూలు(టౌన్): జాతీయ లోక్ అదాలత్‌ను ఈనెల 13న కోర్టు ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని అన్ని న్యాయ స్థానాల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించుకోవాలన్నారు. కర్నూలు జిల్లా కోర్టు ఆవరణలో 5 బెంచీలు, ఇతర మండలాల్లో 15 బెంచీలు ఏర్పాటవుతాయన్నారు. కక్షిదారులు లోక్ అదాలత్‌ను వినియోగించుకుని తమ కేసులను రాజీపూర్వకంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

జ్వరాలు..వైరల్!

- జిల్లాలో ప్రతి ముగ్గురిలో ఒకరికి జ్వరం
- ఏ ఇంట్లో చూసినా బాధితులే!
- కిక్కిరిసిన ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు
- పెద్దాసుపత్రిలో పది రోజులుగా పెరిగిన ఓపీ
- మరోవైపు డెంగీ కేసుల పెరుగుదల

☛ కర్నూలులోని సీతారామనగర్‌కు చెందిన నరేంద్రకుమార్‌కు తీవ్ర జ్వరం రావడంతో ఓ ప్రైవేటు వైద్యున్ని సంప్రదించాడు. అప్పటికప్పుడు మందులు రాసి పంపించారు. నాలుగురోజులైనా జ్వరం తగ్గకపోవడంతో మళ్లీ డాక్టర్ వద్దకు వెళ్లగా రక్తపరీక్షలు చేయించి వైరల్ ఫీవర్ అని తేల్చారు. వారం రోజులు మందులు వాడుతూ విశ్రాంతి తీసుకోవాలని సూచించి పంపించారు.

☛ కర్నూలు నగరంలోని రిటైర్డ్ ఉద్యోగి వెంకటేశ్వర్లు జలుబు, దగ్గు, జ్వరం రావడంతో సమీప ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోగా రూ.2వేలకు పైగా ఖర్చయ్యింది. ఇలాగే తన కుమారునికి కూడా జ్వరం రావడంతో మెడికల్‌షాపునకు వెళ్లి మందులు కొని వాడి తగ్గించుకున్నాడు.

☛ ఆస్పరి మండలం బిల్లేకల్ ప్రాంతానికి చెందిన ఈరన్నకు వారం రోజులుగా జ్వరం తగ్గకపోవడంతో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వెళ్లాడు. వైద్యులు డెంగీ జ్వరంగా అనుమానించి చికిత్స అందించారు. వారం రోజులు చికిత్స అందించగా అతనికి బాగు కావడంతో డిశ్చార్జ్ చేశారు.

తీవ్రమైన నొప్పులు... శరీరమంతా నిస్సత్తువ.. కళ్ల వెంట వస్తున్న నీళ్లు... వీడని జలుబు, దగ్గు.. ఈ లక్షణాలు ఇటీవల ఎక్కువ అయ్యాయి. జిల్లాలో ప్రతి ముగ్గురిలో ఒకరికి జ్వరం వస్తోంది. వైరల్ ఫీవర్ కావడంతో ఒకరి నుంచి మరొకరికి వస్తూ ప్రతి ఇంట్లో బాధితులు ఉన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ఇదిలా ఉండగా జిల్లాలో డెంగీ కేసులు సైతం విపరీతంగా పెరిగిపోతున్నాయి.

కర్నూలు(హాస్పిటల్): వర్షాలు తగ్గుముఖం పట్టి మళ్లీ పడుతుండటంతో జ్వరపీడితుల కేసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. చాలా మంది ముందుగా మెడికల్‌షాపులకు వెళ్లి లక్షణాలు చెప్పి రెండు, మూడు రోజులు మందులు వాడుతున్నారు. అప్పటికీ తగ్గకపోతేనే వైద్యుల వద్దకు వెళుతున్నారు. అయినా కూడా జిల్లాలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, యుపీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రులు, బోదనాసుపత్రులు జ్వరపీడితులతో కిటకిటలాడుతున్నాయి. గత పదిరోజులుగా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఓపీ రోగుల సంఖ్య 3,200లు దాటుతోంది. సాధారణ రోజుల్లో ఈ సంఖ్య 2వేల నుంచి 2,500 మధ్య ఉండేది. అందులోనూ జనరల్ మెడిసిన్, చిన్నపిల్లల విభాగాల్లో రెట్టింపు సంఖ్యలో ఓపీ నమోదవుతోంది. వీటిలో సగం మంది జ్వరపీడితులేనని వైద్యులు చెబుతున్నారు. అందులోనూ ఎక్కువగా వైరల్ ఫీవర్లే ఉంటున్నాయి. ఈ జ్వరం ఇంట్లో ఒకరికి వస్తే క్రమంగా కుటుంబసభ్యులందరినీ వేధిస్తోంది. ముందుగా జలుబు, దగ్గు వచ్చి అనంతరం ఒళ్లునొప్పులు ప్రారంభమై తీవ్ర జ్వరం వేధిస్తోంది. మరోవైపు జిల్లాలో ఇప్పటి వరకు 2,198 మందికి డెంగీ లక్షణాలు ఉండగా అందులో 196 మందికి పాజిటివ్‌గా నమోదైంది.

'ఓపి'క నశించి..

ప్రైవేటు ఆసుపత్రుల్లో ఖర్చు చేయడానికి భయపడి ప్రభుత్వ ఆసుపత్రులకు వెళితే అక్కడ అరకొర వైద్యం అందుతోంది. పీహెచ్‌సీల్లో చాలా చోట్ల వైద్యులు ఉండకపోవడంతో అక్కడున్న నర్సులు, ఫార్మాసిస్టులే మందులు ఇస్తున్నారు. దీంతో సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రులు, కర్నూలు పెద్దాసుపత్రికి రోగులు వస్తున్నారు. సీమెచ్‌సీ, ఏరియా ఆసుపత్రుల్లో జ్వరలక్షణాలను బట్టి మందులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. అయినా జ్వరం తగ్గకపోవడంతో బతుకుజీవుడా అంటూ కర్నూలుకు జ్వరపీడితులు వస్తున్నారు. కర్నూలుకు రావడానికి సైతం ప్రయాణ ఇబ్బందులు తప్పడం లేదు. జ్వరపీడితులు సైతం కూర్చోవడానికి ఆర్టీసీ బస్సులు ఉండటం లేదు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఓపీ కోసం అరగంట, చికిత్స కోసం గంట, వైద్యపరీక్షలకు మరో గంట వేచి ఉండాల్సి వస్తోంది. మొత్తానికి ప్రభుత్వ ఆసుపత్రిలో మూడు, నాలుగు గంటలు నిలబడితే గానీ పూర్తి స్థాయిలో వైద్యం అందని పరిస్థితి నెలకొంది. జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్ వంటి విభాగాలు రోగుల రద్దీ దృష్ట్యా మధ్యాహ్నం 1.30 గంటల వరకు కొనసాగిస్తున్నాయి.



కర్నూలు పెద్దాసుపత్రిలో ఓపీ వద్ద మహిళల ఇబ్బందులు

ప్రైవేటులో ఫీజుల బాదుడు!

జ్వరం వచ్చిన వారు ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లే డెంగీ, మలేరియా ఉంటుందేమోనని పదిరకాలకు పైగా రక్తపరీక్షలు చేయిస్తున్నారు. ఒక్కో ఆసుపత్రిని బట్టి పరీక్షలు, చికిత్సకు అయ్యే మొత్తం ఖర్చు రూ.3వేల నుంచి రూ.5వేల వరకు ఉంటోంది. అది మలేరియా, డెంగీ లాంటి లక్షణాలుంటే మాత్రం ఆసుపత్రిలో నాలుగైదు రోజులు చేరి చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం రూ.30వేల నుంచి రూ.50వేల దాకా వసూలు చేస్తున్నారు. ఆర్థికస్థోమత ఉన్న వారు వైద్యులు చెప్పిన మేరకు ఖర్చు చేస్తుండగా మరికొందరు ఇప్పుడే వస్తామంటూ అక్కడి నుంచి జారుకుని ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్తున్నారు.



పెద్దాసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

వైరల్ ఫీవర్లే ఎక్కువగా వస్తున్నాయి



ఆసుపత్రిలోని జనరల్ మెడిసిన్ ఓపీకి ప్రతిరోజూ 300 నుంచి 400 మంది రోగులు వస్తున్నారు. అందులో సగానికి పైగా జ్వరపీడితులే ఉంటున్నారు. ఎక్కువశాతం జలుబు, దగ్గు, ఒళ్లునొప్పులు, జ్వరంతో బాధపడుతున్న వారే ఉన్నారు. సీజనల్‌గా వచ్చే వైరల్ ఫీవర్లే ఉంటున్నాయి. జ్వరతీవ్రత 102 నుంచి 104 ఫారిన్‌హీట్ వరకు ఉంటోంది. అవసరమైన వారికి వైద్యనిర్ధారణ పరీక్షలు చేయించి మందులు ఇచ్చి పంపిస్తున్నాం. ఇందులో రోజూ 10 నుంచి 15 మంది అడ్మిషన్ చేస్తున్నాం. కొందరికి మలేరియా లక్షణాలు కనిపిస్తుండటంతో అందుకు సంబంధించిన వైద్యం అందిస్తున్నాం.

–డాక్టర్ కె.సోమప్ప, అసోసియేట్ ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్, జీజీహెచ్, కర్నూలు

వాతావరణ మార్పులతో జ్వరాలు



వర్షాలు బాగా కురిసి ఆగిపోవడంతో జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైరల్ ఫీవర్ల కేసుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఐదు రోజులుగా జ్వరం ఉండి ఆసుపత్రికి వచ్చిన ప్రతి ఒక్కరికీ డెంగీ, మలేరియా కిట్స్ ద్వారా పరీక్షలు చేస్తున్నాం. పాజిటివ్ వస్తే అవసరమైన చికిత్స అందిస్తున్నాం. వీరిని ఫాలో అప్ చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందికి చెబుతున్నాం. తగ్గకపోతే కర్నూలుకు రెఫర్ చేయాలని ఆదేశిస్తున్నాం. వర్షాల కారణంగా నీరు నిలిచిన చోట దోమలు వృద్ధి చెందకుండా క్రిమిసంహారక మందు పిచికారీ చేయిస్తున్నాం. డెంగీ, మలేరియా ప్రబలిన ప్రాంతాల్లో అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం.

–నూకరాజు, జిల్లా మలేరియా అధికారి, కర్నూలు

పెద్దాసుపత్రిలో గత తొమ్మిది రోజులుగా నమోదైన ఓపీ

తేదీ(వారం)	ఓపీ సంఖ్య	జనరల్ మెడిసిన్	పీడియాట్రిక్స్
1(సోమ)	3,339	425	295
2(మంగళ)	3,131	526	265
3(బుధ)	3,020	437	292
4(గురు)	2,167	311	210
5(శుక్ర)	1,955	253	186
6(శని)	2,795	395	306
7(ఆది)	831	0	0
8(సోమ)	3,420	412	308
9(మంగళ)	3,217	444	292

వైద్య కళాశాలలపై బాబు కుట్ర

- రూ. 5 వేల కోట్లు ఖర్చు చేస్తే వైద్య కళాశాలలు అందుబాటులోకి వస్తాయి
- మంత్రి నారా లోకేష్ అనుచరుల కోసమే ప్రైవేటీకరణ
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి



కర్నూలు (టౌన్): దేశ చరిత్రలో ఒకేసారి రాష్ట్రానికి 17 వైద్య కళాశాలలను తీసుకువచ్చిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఎక్కడ పేరు వస్తుందనే అక్కసుతోనే వాటిని సీఎం చంద్రబాబు నాయుడు ప్రైవేటీకరణ చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీమోహన్ రెడ్డి ఆరోపించారు. రూ. 2 లక్షల కోట్ల అప్పు, రాజధాని నిర్మాణానికి మరో రూ. లక్ష కోట్లు ఖర్చు చేస్తున్న చంద్రబాబు. పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అందే ఉచిత వైద్యం కోసం రూ. 5 వేల కోట్లు ఖర్చు చేయ్య లేరా అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం 'ఉన్న' వర్గాలకే ఊడిగం చేస్తుందోని విమర్శించారు. కర్నూలులోని ఎస్వీ కాంప్లెక్స్‌లోని తన చాంబర్‌లో గురువారం ఆయన మాట్లాడారు. జగనన్న హయాంలో నూతన వైద్య కళాశాలల ఏర్పాటుకు రూ. 8 వేల కోట్ల ఖర్చులో రూ. 3 వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. ఇప్పటికే పులివెందుల, పాడేరు ప్రాంతాల్లో వైద్య కళాశాలలు ప్రారంభమయ్యాయన్నారు. మిగతా వైద్య కళాశాలల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మంత్రి నారా లోకేష్ అనుచరుల కోసమే ఈ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తున్నారని విమర్శించారు.

ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

వైద్య కళాశాలల స్థలాలు రూ. వందల కోట్ల విలువైనవని, అయితే ఎకరాకు రూ.100 ప్రకారం 66 సంవత్సరాలు లీజుకు ఇచ్చారని ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. మెడికల్ కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తే వైద్యం పేరుతో ప్రజల నుంచి రూ. లక్షలు వసూలు చేసేందుకే కదా అని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే టీడీపీ నేతలు ఇసుక, మద్యం, మైనింగ్, లిక్కర్ సిండికేట్‌తో రూ. వందల కోట్లు దోపిడీ చేశారని ఆరోపించారు. వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేసి మేనేజ్‌మెంట్ కోటాతో ఒక్కొక్క వైద్య విద్యార్థి నుంచి రూ. లక్షలు వసూలు చేసే అవకాశం ఉందన్నారు. తాము అధికారంలోకి వస్తే ప్రైవేటీకరణను రద్దు చేస్తామని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారన్నారు. కర్నూలు జిల్లాలో వైద్య కళాశాల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని, ఆందోళనలు చేస్తామన్నారు. న్యాయస్థానాలను ఆశ్రయించి పోరాటం చేస్తామని ఎస్వీ స్పష్టం చేశారు.

కర్నూలు జిల్లా కలెక్టర్‌గా డాక్టర్ ఏ.సిరి

పోస్టింగ్ దక్కని పి.రంజిత్‌బాషా

- అధికార కూటమి నాయకులతో అంటకాగినట్లు ఆరోపణ
- సొంత జిల్లాలో కనిపించని తనదైన మార్కు



కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లా నూతన కలెక్టర్‌గా డాక్టర్ అట్టాడ సిరి నియమితులయ్యారు. ఆమె సెంకడరీ హెల్త్ డైరక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై కర్నూలుకు వస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న పి.రంజిత్‌బాషాకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. జేఏడీలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2015 బ్యాచ్‌కు చెందిన ఎ.సిరి స్వామిత్వ ప్రత్యేక కమిషనర్‌గా, ఉమెన్ డెవలప్‌మెంట్‌అండ్ చైల్డ్ వెల్ఫేర్ డైరక్టర్‌గా, అనంతపురం జాయింట్ కలెక్టర్(వార్డు, గ్రామ సచివాలయాలు)గా, ఆప్కో వైస్ చైర్మన్ అండ్ ఎండీగా పనిచేశారు. కర్నూలు జిల్లా చరిత్రలో ఈమె రెండో మహిళా కలెక్టర్. గతంలో డాక్టర్ సృజన మొదటి కలెక్టర్‌గా జిల్లాలో సేవలందించారు. వీరిద్దరూ డాక్టర్లే కావడం విశేషం. ఎ.సిరి ఎక్కడ పనిచేసినా తనదైన మార్కును కనపరుస్తారనే ప్రచారం ఉంది.

నూతన కలెక్టర్‌కు సవాళ్ల స్వాగతం

- ➤ ఉల్లి రైతులు మద్దతు ధర కోసం నిరీక్షిస్తున్నారు. ప్రభుత్వం క్వింటా ఉల్లి మద్దతు ధర రూ.1200 ప్రకటించినా రైతులకు ఉపయోగం లేకుండా పోతోంది. ఈ క్రమంలో రైతులను ఏ విధంగా ఆదుకుంటారో వేచి చూడాలి.
- ➤ వేదవతి ప్రాజెక్టు భూసేకరణ, హెచ్ఎన్ఎస్ఎస్ విస్తరణ పనులు కూడా కూటమి ప్రభుత్వంలో ఒక్క అడుగు ముందుకు కదలడం లేదు.
- ➤ స్వర్ణాంధ్ర లక్ష్యాలను అధికారులు దాదాపు రూ.10 వేల కోట్లతో రూపొందించారు. వాటికి సంబంధించి ప్రభుత్వంతో మాట్లాడి నిధులు సమకూర్చాల్సి ఉంది.
- ➤ జిల్లాలో భూ సమస్యలు ఎక్కడికక్కడ పేరుకుపోయాయి. పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ప్రతి సోమవారం పెద్ద ఎత్తున జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలి వచ్చి అర్జీలు ఇచ్చుకుంటున్నారు.

పి.రంజిత్‌బాషా వచ్చారు.. వెళ్లారు!

సొంత జిల్లాలో కలెక్టర్‌గా పనిచేసే అవకాశం దక్కినా తనదైన మార్కును చూపించలేకపోయారనే అపవాదును పి.రంజిత్‌బాషా మూటకట్టుకున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని నందికొట్కూరు ఆయన సొంతూరు. ప్రస్తుతం నందికొట్కూరు నంద్యాల జిల్లాలో ఉన్నా చదువు, ఇతర అభ్యాసాలు కర్నూలులోనే సాగించారు. ఇక్కడికే కలెక్టర్‌గా రావడంతో జిల్లా అభివృద్ధికి ఎంతో దోహదపడతారని ఆశించారు. అయితే ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేకపోయారనే చర్చ జరుగుతోంది. కూటమి నాయకుల చెప్పు చేతల్లో పని చేయడంతో కేవలం 15.5 నెలలకే బదిలీపై వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని కూడా ఆయన గుర్తు పట్టలేకపోయారంటే ఏస్థాయిలో పరిపాలన సాగించారో అర్థమవుతోందనే చర్చ ఉంది. కేవలం వచ్చారు, వెళ్లారనే రీతిలో బదిలీ కావడం గమనార్హం.



సి. బెళగల్ మండలం గుండ్రేవుల గ్రామ దారిలో వర్షపునీటిలో తడిసి ముద్దయిన ఉల్లి పంట

పంటలు వర్షార్పణం

కర్నూలు(అగ్రికల్చర్): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గురువారం తెల్లవారు జాము నుంచి జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. పొలాలు నీటమునిగి పంటలన్నీ దెబ్బతిన్నాయి. రైతుల ఆశలన్నీ వర్షార్పణం అయ్యాయి. చేతికొచ్చిన పత్తిని తీసే సమయంలో భారీ వర్షం కురియడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. అమ్ముకోవడానికి ఆరబెట్టుకున్న ఉల్లి వర్షపు నీటిలో కొట్టుకుపోయింది. కూరగాయల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. జలదిగ్బంధంలో ఉండి వరి పైరు కుళ్లిపోతోంది.

కుండపోత వర్షం

జిల్లాలో గూడూరు, మద్దికెర మండలాల్లో కుండపోత వర్షం కురిసింది. హంద్రీ నదికి భారీ ఎత్తున వరద నీరు వచ్చింది. అత్యధికంగా గూడూరులో 99 మి.మీ., అత్యల్పంగా గోనెగండ్లలో 2.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఒకే రోజు జిల్లా మొత్తంగా 29.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. గూడూరులో 99, మద్దికెరలో 97.8, చిప్పగిరిలో 68.4, హాలహర్విలో 62.2, మంత్రాలయంలో 51.6, తుగ్గలిలో 45.4, ఆలూరులో 38.4, పత్తికొండలో 35.2, కల్లూరులో 30.8 మి.మీ. ప్రకారం వర్షం కురిసింది. సెప్టెంబరు నెల సాధారణ వర్షపాతం 116.5 మి.మీ. ఉండగా ఇప్పటికి వరకు 38.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. శుక్రవారం కూడా జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు.

పత్తి, ఉల్లికి భారీ నష్టం...

అధిక వర్షాలతో పత్తి, ఉల్లి పంటలకు భారీ నష్టం జరిగింది. వర్షాలకు ఉల్లి కుళ్లిపోవడంతో ప్రతి రైతూ 50 నుంచి 200 క్వింటాళ్ల వరకు పారబోయాల్సి వచ్చింది. ఉల్లిలో మురుగులు ఉన్నాయనే కారణంతో వ్యాపారులు క్వింటా ఉల్లిగడ్డలను రూ.100, రూ.200 కొంటున్నారంటే రైతుల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో ఊహించవచ్చు. జిల్లాలో 11 వేలకు పైగా హెక్టార్లలో ఉల్లి సాగైంది. ఇందులో 100 హెక్టార్ల మేరు పశువులకే వదిలేశారు. అయితే ఉద్యాన శాఖ అధికారులు.. ఉల్లి పంట నష్టం జరిగినట్లు చూపిన దాఖలాలు లేవు. మరోవైపు పత్తిపై రైతుల్లో ఆశలు ఎక్కువగా ఉన్నాయి. మొదటి విడత పత్తి తీతలు త్వరలో మొదలు కానున్నాయి. భారీ వర్షాలు పడటం, వాగులు, వంకలు పొంగి పంట పొలాలను ముంచెత్తడంతో పత్తికి భారీగానే నష్టం జరిగింది. గూడూరు, మద్దికెర, చిప్పగిరి, హాలహర్వి మండలాల్లో పత్తి పంట భారీగానే దెబ్బతినింది. వ్యవసాయ శాఖ మాత్రం పంట నష్టం లేదని తేల్చింది. మంత్రాలయం మండలంలో వరి పంట నీట మునిగింది.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం



ఇటీవల జర్నలిస్టులు, 'సాక్షి' ఎడిటర్‌ను తరచూ ప్రభుత్వం కేసులతో వేధిస్తోంది. చివరకు ఓ జిల్లాలో ఓ ప్రజాప్రతినిధి ప్రెస్‌మీట్ నిర్వహిస్తే దాన్ని ప్రచురించినందుకు కూడా ఎడిటర్‌పై కేసు నమోదు చేశారు. ప్రజాస్వామ్యంలో మీడియా అనేది ఫోర్త్ పిల్లర్‌గా భావిస్తాం. మీడియాను నిరోధించడం, అడ్డుకోవడం, జర్నలిస్టులను బెదిరించడం అమానుషం. ప్రజల గొంతును వినిపించే బాధ్యత ప్రజాప్రతినిధులు, మీడియాది. మీడియాను అడ్డుకోవడం అంటే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. రాజకీయ అజెండాతో పుట్టిన కొన్ని పత్రికలే న్యూట్రల్‌గా వార్తలు రాస్తుంటే, న్యూట్రల్ పత్రికలుగా ఉన్నవి పూర్తి రాజకీయ అజెండాతో పని చేస్తూ ప్రభుత్వాలను, వ్యవస్థలను శాసిస్తున్నాయి. ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ప్రజాస్వామిక వాదులు, ఇతర మీడియా సంస్థలు ఈ వైఖరిని ఖండించకపోవడం కూడా తప్పే. ప్రజాస్వామ్యానికి దురదృష్టకరం. – బుగ్గన రాజేంద్రనాథరెడ్డి, మాజీ మంత్రి



పత్రికా స్వేచ్ఛపై దాడి అనైతికం



ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల కోసం పనిచేసే ఏ రాజకీయ పార్టీలు కూడా పత్రిక స్వేచ్ఛకు ఆటంకం కలిగించకూడదు. పత్రికా స్వేచ్ఛ అంటే భారత రాజ్యాంగంలో 19(1) ఏ ద్వారా కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛ. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య పత్రికలు వారధిగా పనిచేస్తాయి. నేతల ప్రసంగాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వాటి నైతిక బాధ్యత. అలాంటి పత్రికలపై కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ ఎడిటర్, పాత్రికేయులపై కేసులు నమోదు చేయడం దుర్మార్గమైన చర్య. పత్రికల్లో ఏవైనా వార్తలు అభ్యంతరకరంగా ప్రచురితమైతే నేతలు వివరణ ఇవ్వాల్సి ఉంది. చట్టం తమ చేతుల్లో ఉంది కదా అని చెప్పి పత్రికలపై తప్పుడు కేసులు నమోదు చేయడం సబబు కాదు. కూటమి ప్రభుత్వపు నిరంకుశ ధోరణిని ప్రజలు గమనిస్తున్నారు. – శిల్పా మోహన్ రెడ్డి, మాజీ మంత్రి

క్లుప్తంగా

డిప్లమా కోర్సుల దరఖాస్తు గడువు పొడిగింపు

కర్నూలు(హాస్పిటల్): స్టేట్ అలైడ్ అండ్ హెల్త్ కేర్ డిప్లమా కోర్సుల దరఖాస్తు గడువు పొడిగించినట్లు కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 27వ తేది సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు భర్తీ చేసిన దరఖాస్తులను కార్యాలయ పనిదినాల్లో కర్నూలు మెడికల్ కాలేజి కార్యాలయంలో రూ.100 రుసుము చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. పోస్టు ద్వారా వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవన్నారు. దరఖాస్తులు aprahpc.co.in వెబ్‌సైట్‌లో లభిస్తాయన్నారు. అక్టోబర్ 10వ తేదిన అభ్యర్థులకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. ఈ కోర్సులకు ఇంటర్, తత్సమాన విద్యార్హత కలిగిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటర్ బైపీసీ చదివిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని, తర్వాత మిగిలిన గ్రూపులకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు.

వైద్యం వికటించి గర్భిణి మృతి

ఎమ్మిగనూరు రూరల్: స్థానిక ప్రైవేట్ నర్సింగ్‌హోంలో వైద్యం వికటించి గర్భిణి మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. మంత్రాలయం మండలం సుగూరు గ్రామానికి చెందిన పార్వతి పెద్దపెండేకల్‌కు చెందిన నరసింహులకు ఇచ్చి కొన్ని సంవత్సరాల క్రితం వివాహం జరిపించారు. రెండో కాన్పుకు పార్వతి పుట్టినిల్లు సూగురుకు వచ్చింది. బుధవారం సాయంత్రం నొప్పులు రావటంతో ఎమ్మిగనూరులోని ఓ ప్రైవేట్ నర్సింగ్‌హోంకు తీసుకొచ్చారు. రాత్రి నర్సింగ్ హోంలో అడ్మిట్ చేసుకొని గురువారం ఉదయం డెలివరి చేస్తామని థియేటర్‌లోకి తీసుకెళ్లారు. మత్తు ఇంజక్షన్ ఇచ్చిన కొద్దిసేపటికి ఫిట్స్ రావటంతో పరిస్థితి బాగోలేదని ఆదోనికి పంపించారు. అక్కడికి వెళ్లిన కొద్దిసేపటికే మృతి చెందింది. సాయంత్రం నర్సింగ్ హోం దగ్గరకు మృతదేహం రావటంతో పెద్ద సంఖ్యలో బంధువులు చేరుకుని ఆందోళన చేపట్టారు. అయితే పెద్ద ఎత్తున పరిహారం ఇచ్చేందుకు ఆసుపత్రి యాజమాన్యం అంగీకరించడంతో ఆందోళన విరమించినట్లు తెలిసింది.

అమరవీరుల సేవలు స్మరణీయం



అటవీ అమరవీరుల దినోత్సవంలో అటవీ శాఖ అధికారులు

కర్నూలు కల్చరల్: అటవీ శాఖ అమరవీరుల సేవలు చిరస్మరణీయమని అటవీ శాఖ కర్నూలు డివిజన్ స్క్వాడ్ డీఎఫ్‌వో రవిశంకర్ అన్నారు. గురువారం అటవీ శాఖ సర్కిల్ కార్యాలయంలో జాతీయ అటవీ అమర వీరుల దినోత్సవం జరిగింది. డీఎఫ్‌వోతో పాటు కర్నూలు రేంజ్ ఎఫ్ఆర్‌వో విజయకుమార్, స్క్వాడ్, సోషల్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రమణారెడ్డి, సర్కిల్ కార్యాలయం ఏవోలు అబ్దుల్ సుభాన్, షానవాజ్, డివిజన్ కార్యాలయం ఏవో మహమ్మద్ ఏషన్, అటవీ శాఖ ఉద్యోగులు అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్క్వాడ్ డీఎఫ్‌వో రవిశంకర్ మాట్లాడుతూ కర్నులు సర్కిల్ పరిధిలో 23 మంది అటవీ శాఖ ఉద్యోగులు విధి నిర్వహణలో అమరులయ్యారన్నారు. వారి సేవలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగులు అడవుల సంరక్షణ బాధ్యతను మరువకూడదన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వర్ష బీభత్సం.. జల దిగ్బంధం



ఉయ్యాలవాడ, పడిగెపాడు గ్రామాల మధ్య నీటమునిగిన పత్తి పంట



అమడాల సమీపంలో మిరప పంటను ముంచెత్తిన వర్షపునీరు



సి.బెళగల్ మండలం పోలకల్లో వరద నీటిలో కొట్టుకు వచ్చిన ఉల్లి



హొలహర్వి-నిట్రవట్టి వెళ్లే దారిలో ఉప్పొంగిన వాగు



సి.బెళగల్ మండలం పోలకల్ సమీపంలో వాగులో ప్రయాణికులతో చిక్కుకపోయిన ఆర్టీసీ బస్సు



అల్లూరు గ్రామ సమీపంలో నేల కూలిన భారీ వృక్షం



కోవెలకుంట్లలో జలమయమైన రహదారి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో గురువారం భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రాకపోకలకు స్తంభించాయి. జనజీవనం అస్తవ్యస్తమైంది. కొన్ని చోట్ల ఆర్టీసీ బస్సులు వాగుల్లో చిక్కుకుపోయాయి. ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బయటపడ్డారు. పొలాల్లో పంటలు నీట మునిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. –సాక్షి నెట్‌వర్క్



గుండ్రేవుల గ్రామం దగ్గర వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్న తుంగభద్ర నది



కర్నూలు సమీపంలోని జాతీయ రహదారిలో నిలిచిన వర్షపు నీరు



కునుకుంట-ఉప్పలపాడు మధ్యలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు



కొత్తపల్లి మండలం గువ్వలకుంట్ల గ్రామంలో నేలమట్టమైన విద్యుత్ స్తంభం

కర్నూలు సర్కిల్ అటవీ శాఖ కన్జర్వేటర్‌గా కృష్ణమూర్తి

- ఎస్ఎస్‌టీఆర్ ఎఫ్‌డీ పిటీగా విజయకుమార్





కృష్ణమూర్తి, బి.విజయ్ కుమార్

కర్నూలు కల్చరల్/ఆత్మకూరురూరల్: కర్నూలు సర్కిల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(సీఎఫ్)గా ఐఎఫ్ఎస్ బీపీఏ కృష్ణమూర్తి నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఐఎఫ్ఎస్ బదిలీల్లో భాగంగా శ్రీశైలం ప్రాజెక్ట్ టైగర్ సర్కిల్ ఫీల్డ్ డైరెక్టర్‌గా ఉన్న ఈయనను కర్నూలుకు బదిలీ చేశారు. రాజమహేంద్రవరం ఏపీ స్టేట్ ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్‌గా ఉన్న బి. విజయకుమార్‌ను శ్రీశైలం ప్రాజెక్ట్ టైగర్ సర్కిల్ ఫీల్డ్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్న వి.సాయిబాబను తిరుపతి డీఎఫ్‌వోగా, అనంతపురం డీఎఫ్‌వో విగ్నేష్ అప్పావూను ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

తహసీల్దార్ కార్యాలయంలో ఇరువర్గాల ఘర్షణ

మంత్రాలయం రూరల్: భూ వివాదంతో ఏకంగా తహసీల్దార్ కార్యాలయంలోనే ఇరువర్గాల వారు ఘర్షణ పడ్డారు. ఈ ఘటన మంత్రాలయంలో గురువారం చోటు చేసుకుంది. మండల పరిధిలోని వగురూరు గ్రామంలో ఒక వ్యక్తి.. తనకు 28ఎకరాలు ఉండాల్సి ఉండగా ఒకటిన్నర ఎకర పొలం తక్కువగా ఉందని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. సమస్యను పరిష్కారించడానికి ఇరువర్గాల వారు గురువారం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. మాటామాటా పెరిగి ఒకరిపై ఒకరు దూషించుకున్నారు. పరస్పరం దాడులకు పాల్పడ్డారు. దీంతో అక్కడే ఉన్న ప్రజలు, రెవెన్యూ సిబ్బంది పరుగులు తీశారు. అధికారులు జోక్యం చేసుకుని ఇరువర్గాల వారిని మందలించి బయటకు పంపేశారు. దీంతో వారు పోలీస్‌స్టేషన్ చేరుకుని ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు.

ముందస్తు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు ఏర్పాట్లు



ప్రొజెక్టర్ మానిటర్ ద్వారా క్యాన్సర్ స్క్రీనింగ్ గురించి వివరిస్తున్న డాక్టర్ నాగరాజు, చిత్రంలో డాక్టర్ మహేశ్వరప్రసాద్

కర్నూలు(హాస్పిటల్): ప్రజలు క్యాన్సర్ వ్యాధిన పడకుండా ముందస్తు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ మహేశ్వరప్రసాద్ చెప్పారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలోని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే సామాజిక అధికారులు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని ఆరోగ్య కార్యకర్తలు హాజరయ్యారు. నోటి క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్‌ల స్క్రీనింగ్ గురించి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా డాక్టర్ నాగరాజు వివరించారు. అనంతరం డాక్టర్ మహేశ్వరప్రసాద్ మాట్లాడుతూ.. క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించి చికిత్స అందిస్తే ఈ వ్యాధిని నియంత్రించవచ్చన్నారు. కర్నూలులోని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రతి మంగళ, గురువారాల్లో ఓపీ నెం.222కు రెఫర్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు వెంకట సుబ్బ నాగరాజు, సాహితి, జయరామ్, విజయభాస్కర్, హడస్కా, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్, ఆర్‌కేఎస్‌కే కన్సల్టెంట్ మల్లికార్జున, ఫైనాన్స్ కన్సల్టెంట్ అరుణ, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన సామాజిక అధికారులు, ఆరోగ్య కార్యకర్తలు

కేంద్రియ విద్యాలయంలో సీట్ల భర్తీ

డోన్ టౌన్: డోన్‌లో కొత్తగా ఏర్పాటైన కేంద్రియ విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి లాటరీ పద్ధతిలో విద్యార్థులకు సీట్లు కేటాయించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆర్థికశాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో డోన్‌లో కేంద్రియ విద్యాలయం ఏర్పాటైంది. 765 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా గురువారం ఎంపిక ప్రక్రియ కమిటీ కన్వీనర్ ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో రిజర్వేషన్ల ప్రకారం 1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు సీట్లు కేటాయించారు. లాటరీ పద్ధతిలో ప్రతి తరగతికి 40 మంది విద్యార్థుల చొప్పున 200 మందికి ప్రవేశం కల్పించారు. ఎంపికైన అభ్యర్థుల వివరాలను కమిటీ స్కూల్ చైర్మన్ జిల్లా కలెక్టర్ ఆదేశాలతో శుక్రవారం నోటీసు బోర్డులో ఉంచనున్నట్లు తెలిపారు. ఈ ఎంపిక పక్రియలో కమిటీ సభ్యులు టీచర్ల కేటగిరి నుంచి ఒకరు, ఎస్సీ, ఎస్టీ కేటగిరి నుంచి ఇద్దరు, కలెక్టర్ ఆదేశాల మేరకు మండల విద్యాధికారులు ప్రభాకర్, నాయక్ హాజరు కాగా అధికారుల సమక్షంలో వీడియో కెమెరా చిత్రీకరిస్తూ లాటరీ పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేశారు. కాగా ఎంపిక ప్రక్రియ ప్రారంభంలో కొంత గందరగోళం నెలకొంది. ప్రజా సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు కన్వీనర్‌ను ప్రశ్నించగా.. తుది జాబితా ప్రకటనలో ఏవైనా అనుమానాలు ఉంటే అభ్యంతరాలు వ్యక్తం చేయవచ్చునని సూచించారు.



లాటరీ పద్ధతిలో సీట్లను భర్తీ చేస్తున్న అధికారులు

పట్టుబడిన మద్యం ధ్వంసం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం ఒకటవ పోలీసు స్టేషన్ పరిధిలో గత రెండేళ్లుగా వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యాన్ని ట్రాక్టర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. గురువారం శ్రీశైలంలోని డంపింగ్ యార్డ్ సమీపంలో నంద్యాల ఎక్సైజ్ ఏఈఎస్ రాముడు, ఎక్సైజ్ సీఐ మోహన్‌రెడ్డి, సీఐ ప్రసాదరావు, రెవెన్యూ అధికారుల సమక్షంలో మద్యం బాటిళ్లకు పంచనామా నిర్వహించి ధ్వంసం చేశారు. 15 నాటుసారా కేసుల్లో 186 లీటర్ల నాటుసారా, 17 కేసుల్లో పట్టుబడిన ఏపీ మద్యం 598 సీసాలు, 11 కేసుల్లో పట్టుబడ్డ తెలంగాణ మద్యం 599 సీసాలను ట్రాక్టర్‌తో తొక్కించారు.



ధ్వంసం చేసిన మద్యం సీసాల వద్ద పోలీసులు

మద్యం విక్రేత అరెస్ట్

సాక్షి ఎఫెక్ట్

పగిద్యాల: 'బడి పక్కనే మద్యం దుకాణం' శీర్షికన సాక్షిలో గురువారం ప్రచురితమైన కథనానికి పోలీసులు స్పందించారు. పడమర ప్రాతకోట ప్రాథమిక పాఠశాల (మెయిన్) పక్కన అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పులికంటి మద్దిలేటిని అరెస్ట్ చేసినట్లు నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం గురువారం తెలిపారు. నందికొట్కూరు పట్టణంలోని వివిధ షాపుల్లో మద్యం తెచ్చుకుని అధిక ధరలకు గ్రామంలో విక్రయిస్తుండగా ఏఎస్‌ఐ శేషయ్య సిబ్బందితో నిఘా వేసి పట్టుకున్నామన్నారు. అతని వద్ద 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.



పట్టుకున్న మద్యం సీసాల వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ సుబ్రమణ్యం

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

- ఎలుకలు తెచ్చిన తంటా!

ఎమ్మిగనూరురూరల్: ఎలుకలు తెంపిన విద్యుత్ వైర్లను చూడకుండా తొక్కి విద్యుదాఘాతంతో గోపికృష్ణ(13) అనే బాలుడు మృతి చెందాడు. ఈ విషాదం ఎమ్మిగనూరు పట్టణంలోని ఎద్దుల మార్కెట్ సమీపంలోని కిరాణం దుకాణంలో గురువారం ఉదయం చోటుచేసుకుంది. వెంకటేష్, పద్మావతిలకు రామకృష్ణ, గోపికృష్ణ ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరి రెండో కుమారుడు గోపికృష్ణ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. గురువారం కిరాణం దుకాణానికి వచ్చిన వారికి సరుకులు ఇస్తూ చూసుకోకుండా కిందపడి ఉన్న విద్యుత్ వైర్‌పై కాలు పెట్టాడు. షాక్ గురై కుప్పకూలిపోయాడు. తల్లిదండ్రులు వెంటనే చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. విద్యుత్ వైర్లను ఎలుకలు తెంపడంతో విషాదం చోటుచేసుకుంది. కుమారుడు మృతి చెందటంతో కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు టౌన్ సీఐ శ్రీనివాసులు తెలిపారు.



గోపికృష్ణ(ఫైల్)



కనకదాసు విగ్రహం ధ్వంసం



మనేకుర్తిలో కనకదాసు విగ్రహాన్ని ధ్వంసం చేసిన దృశ్యం



ఆలూరు ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న కురువలు

ఆలూరు రూరల్: మండలంలోని మనేకుర్తి గ్రామంలోని హైవే-167 పక్కన ఏర్పాటు చేసిన భక్త కనకదాసు విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి ధ్వంసం చేశారు. కనకదాసు వి గ్రహం ఎడమ చేయి విరగొట్టారు. విగ్రహ ధ్వంసా న్ని నియోజకవర్గ కురువ సామాజిక వర్గం నాయకులు ఖండించారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గురువారం ఆలూరు ఎస్ఐ మహబూబ్ బాషాకు ఫిర్యాదు చేశారు. విగ్రహ ధ్వంసాన్ని నిరసిస్తూ మాదారి,మాదాసి కురువ సంఘం నాయకులు స్థానిక అంబేడ్కర్ కూడలిలో గంట పాటు ధర్నా చేపట్టారు.కార్యక్రమంలో దేవేంద్రప్ప,అయ్యాళప్ప, మల్లికార్జున, మహానంది, లింగ,రాజు,నాగేంద్ర,మంగన్న, చంద్ర,ఉల్లేప్ప కురువ కులస్తులు పాల్గొన్నారు.

దాడిని ఖండించిన ఎమ్మెల్యే విరూపాక్షి

కనకదాసు విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనపై వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి ఖండించారు. కనకదాసు విగ్రహాన్ని ధ్వంసం చేయడం దారుణమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు.

అవినీతి దాహం తీరేలా!

సంజామల: పశువుల దాహం తీర్చేందుకు ఊరూరా ఏర్పాటు చేసిన నీటి తొట్లు అధికారులు, టీడీపీ నాయకుల అవినీతిని ఎత్తి చూపుతున్నాయి. నాసిరకంగా నిర్మించి బిల్లులు స్వాహా చేయడంతో ప్రారంభానికి ముందే పగుళ్లు ఇస్తున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద మండలానికి 19 నీటి తొట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతానికి 15 పూర్తయ్యాయి. ఒక్కో తొట్టి నిర్మాణానికి రూ. 30 వేలు వెచ్చించారు. కాగా కొన్ని చోట్ల టీడీపీ నాయకులు, మరి కొన్ని చోట్ల అధికారులు నిర్మించిన నీటి తొట్లు నిరుపయోగంగా మారాయి. నాణ్యత లోపించి ప్రారంభానికి ముందే శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.



ముదిగేడులో నిర్మించిన పశువుల నీటి తొట్టి



ప్రారంభించక ముందే పగులిచ్చిన దృశ్యం